నేడు బీజేపీ జెండా ఆవిష్కరణ

మోతీనగర్‌: భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రినగర్‌ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 8.30 గంటలకు పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరుకానున్నట్లు జిల్లా సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్‌ యాదవ్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని విభాగాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాటక ప్రదర్శన కళాకారులకు సన్మానం



లవకుశ నాటకం ప్రదర్శించిన కళాకారులను సన్మానిస్తున్న రమేష్‌రావు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని ఈస్ట్‌ సాయినగర్‌లో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం లవకుశ నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది కళాకారులను సురభి రమేష్‌రావు సన్మానించి, బహుమతులను ప్రదానం చేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో సోమవారం సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదులను జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు అందజేశారు. టౌన్‌ ప్లానింగ్‌ 7, ఎలక్ట్రికల్‌ 1, ఇంజినీరింగ్‌ 4, అకౌంట్స్‌ 1కి సంబంధించి మొత్తం 13 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరుపత్రం అందజేత

శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్‌ఫండ్‌ రూ.42 వేలలు మంజూరు పత్రాలను పీఏసీ చైర్మన్‌ ఆరికెపూడి గాంధీ సోమవారం అందజేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌ పాపిరెడ్డి కాలనీకి చెందిన తొట్ల ప్రకాష్‌కుమార్‌కు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కెఆర్‌కె రాజు, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి 'బెస్ట్‌ రిప్లై అవార్డు'



అవార్డు అందుకుంటున్న హెచ్‌సీయూ విద్యార్థిని లాస్యప్రియ

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ పోస్టుగాడ్యుయేషన్‌ విద్యార్థిని లాస్యప్రియ ఉత్తమ ప్రత్యుత్తర అవార్డు (బెస్ట్‌ రిప్లై అవార్డు) అందుకుంది. హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌లోని పొలిటికల్‌ సైన్స్‌ విభాగంలో లాస్యప్రియ ఐఎంఏ చదువుతోంది. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన నేషనల్‌ యూత్‌ పార్లమెంట్‌–2025లో ఈ అవార్డు అందుకుంది.జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జరిగిన అన్ని స్థాయిలలో ప్రతిభ చాటింది. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

జగద్గిరిగుట్ట : చింతల్‌, పద్మానగర్‌ ఫేజ్‌ 1, శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. మంగళవారం పుణ్యాహవచనం, రక్షాబంధనం, శాత్తుములు, 9న శాంతి పాఠం, ద్వారతోరణ పూజ, బలిహరణం, 10న మంగళాశసనం, మూర్తి కుంభ ఆరాధన, 11న తిరు కల్యాణ మహోత్సవం, అన్నదానం, 12న కుంకుమార్చన, నిత్య హోమం, 13న చతుస్థాన అర్చన, యాగశాల బలిహరణ, చక్రస్నానం, ధ్వజ అవరోహన, సప్తవరణం, ఆశీర్వచనం తదితర పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నిలువ నీడ లేక?

- బస్సుల కోసం ఎండలో ఎదురు చూడాల్సిందే
- ఆధునీకరణ పేరుతో ఉన్న దాన్ని తొలగించిన అధికారులు
- ఏర్పాటు కోసం పలుమార్లు భూమిపూజ
- వ్యాపారుల అభ్యంతరంతో ముందుకు సాగని పనులు



ప్రధాన రోడ్డులో బస్సు కోసం ఎండలో ఎదురు చూస్తున్న ప్రయాణికులు



మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌, కబీర్‌ నగర్‌లో గతంలో బస్‌ షెల్టర్లు ఉండేవి. ఆధునీకరణ పేరుతో ఉన్న వాటిని తొలగించి గత పాలకులు భూమి పూజ సైతం చేశారు. ప్రధాన రోడ్డులో గతంలో బస్‌ షెల్టర్‌ ఉన్న స్థానంలో, మదీనా చౌరస్తాలో బస్‌ షెల్టర్‌ నిర్మించాలని కూకట్‌పల్లి డిపో మేనేజర్‌ సైతం గతంలో పలుమార్లు స్థలాన్ని సేకరించారు. వ్యాపారులకు అడ్డుగా వస్తుందని అభ్యంతరాలు తెలపడంతో ఏర్పాట్లను విరమించుకున్నారు. కబీర్‌ నగర్‌ బస్‌స్టాప్‌లో ఉన్న బస్సు షెల్టర్‌ వాటర్‌ ఏటీఎం ఏర్పాటుతో దాన్ని తొలగించారు. నిత్యం బోరబండ నుంచి వందలాది ట్రిప్పులు నగరంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఉదయం తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమై రాత్రి 12 గంటల వరకు బస్సులు నగరంలోని వివిధ ప్రాంతాలకే కాకుండా ఆయా జిల్లాల వాసులు కూడా రాకపోకలు ఇక్కడి నుంచి కొనసాగిస్తారు. వర్షాలు పడ్డప్పుడు, ఎండలు బాగా ఉన్నప్పుడు వ్యాపార సముదాయాల ముందు, నీడ ఉన్న ప్రాంతాల్లో నిలుచుని బస్సుల కోసం నిరీక్షిస్తారు. బస్సు రాగానే పరుగెత్తుకుంటూ వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తుంది. దీంతో వయో వృద్ధులు, మహిళలు ఆ విధంగా బస్సు ఎక్కాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. వీరు వెళ్లే సమయానికి ఆ బస్సు వెళ్లిపోతుంది. దీంతో వారు తిరిగి నీడపట్టున వేచి చూడాల్సి రావటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విధంగా చేయటంతో తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. మోతీనగర్‌ ప్రధాన రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా బస్సు షెల్టర్లు లేకపోవడంతో పాటు ఆయా ప్రాంత వాసులు రోడ్లపై నిలబడి తమ తమ గమ్య స్థానాలకు ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. గతంలో బస్సు షెల్టర్‌ ఏర్పాటు కోసం ఓ సీనియర్‌ సిటిజన్‌ విసుగు చెంది ఆత్మహత్యకు సైతం పాల్పడిన సంఘటన ఉంది. సమీపంలో ఉన్న పాండురంగ నగర్‌లో మాత్రం దాతల సాయంతో బస్సు షెల్టర్‌ నిర్మించారు. మోతీనగర్‌, కబీర్‌ నగర్‌లో కూడా ఇటువంటి దాతలు ముందుకు వచ్చి బస్‌ షెల్టర్‌లను ఏర్పాటు చేసుకుంటే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ వేసవి కాలంలోనైనా బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉన్నది తొలగించి నిర్మించలేదు



మోతీనగర్‌ ప్రధాన రోడ్డులో బస్సు షెల్టర్‌ గతంలో ఉండేది. ఆధునీకరణమైన బస్సు షెల్టర్‌ నిర్మాణం చేస్తామని ఉన్న దాన్ని తొలగించారు. పలుమార్లు బస్‌ షెల్టర్‌ కోసం భూమి పూజ సైతం చేశారు. కానీ నిర్మించలేదు. దీంతో ప్రయాణికులు ఎండా, వాన, చలి కాలాల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రోడ్డులో ఇరువైపులా బస్‌ షెల్టర్‌ నిర్మాణం చేపట్టాలి.

-నలమాల్పు అంజిరెడ్డి, స్థానికుడు

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్‌ నాయకులు తదితరులు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కాంగ్రెస్‌ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలానగర్‌ డివిజన్‌ ఇందిరానగర్‌ కాలనీకి చెందిన కాంగ్రెస్‌ నాయకులు పుట్టపాగ మధు, బాలరాజు, కురుమయ్యతో సహా 50 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ నాయకుడు గిరి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం నాడు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ.. నాడు బీఆర్‌ఎస్‌ పాలనలో ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన అభివృద్ధే నేడు కనిపిస్తుందని, నేటి కాంగ్రెస్‌ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్‌ పరిపాలన చూసి ప్రజలు విసుగెత్తిపోయారని, అందుకే అభివృద్ధికి పట్టం కట్టాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

రేకుల షెడ్డు ప్రారంభం



రేకుల షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానం ముందు భాగంలో రేకుల షెడ్డును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కురుమయ్యగారి కొండల్‌రావు, గొట్టిముక్కల వెంగళరావు, కురుమయ్యగారి నర్సింగ్‌రావు, వడ్డేపల్లి రాజేశ్వరావు, రామాలయం చైర్మన్‌ తులసిరావు, కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, గ్రామపెద్దలు, దేవస్థాన మాజీ చైర్మన్లు, భక్తులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



భూమి పూజలో కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్‌ నర్సింహయాదవ్‌ అన్నారు. సోమవారం డివిజన్‌ పరిధిలోని హస్మత్‌పేట ప్రధాన రహదారిలోని నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు బాలమ్మ, మహేష్‌, రవి, శ్యాంసుందర్‌, మోహన్‌, పరమేష్‌, విఠల్‌, నరేష్‌, నాగేందర్‌, మధు, శ్రీనివాస్‌ సహకారంతో కమ్యూనిటీ హాల్‌ను ఆలయ ప్రాంగణంలో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, మన్నె ఉదయ్‌యాదవ్‌, గడ్డం నర్సింగ్‌రావు, బాలరాజు, మక్కాల సత్యనారాయణ, బుర్రి యాదగిరి, పోచయ్య, మట్టి శ్రీను, రత్నకుమారి, రాజుగౌడ్‌, వెంకటేశ్‌, నాగేష్‌, గణేష్‌, కుమ్మరి బాలరాజు లలితా తదితరులు పాల్గొన్నారు.

జీబ్రా క్రాసింగ్‌ వద్దనే రోడ్డు దాటాలి

అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్‌: రోడ్డు దాటే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని, జీబ్రా క్రాసింగ్‌ల వద్దనే రోడ్డు దాటాలని అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐ నాగరాజు అన్నారు. గుండ్లపోచంపల్లి, అయోధ్యలో భవన నిర్మాణ కార్మికులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌, జీబ్రా క్రాసింగ్‌లు లేని ప్రాంతాల్లో వాహనాలను గమనిస్తూ చేతితో సిగ్నల్‌ ఇస్తూ దాటాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో మొబైల్‌ ఫోన్‌లు వాడరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉంటే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లో అకస్మాత్తుగా మంటలు



జగద్గిరిగుట్ట : బైక్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో వాహనం బూడిదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన సంతోష్‌ (22) బైక్‌ మెకానిక్‌. బైక్‌ మరమ్మతులకు సంబంధించిన విభాగాలను జగద్గిరిగుట్ట ఔట్‌పోస్ట్‌ సమీపంలోని ఓం సాయి ఆటోమొబైల్స్‌ షాపులో తీసుకున్నాడు. తిరిగి వెళ్లేందుకు బైక్‌ను స్టార్ట్‌ చేయగా సైలెన్సర్‌ నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దీంతో బైక్‌ను వదిలి సంతోష్‌ పక్కకి జరిగాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న జగద్గిరిగుట్ట ఎస్‌ఐ మహేందర్‌ రెడ్డి స్థానికుల సాయంతో మంటలార్పారు. అప్పటికే బైక్‌ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ

కుత్బుల్లాపూర్‌: బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని, రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. జై బాపు..జై భీమ్‌..జై సంవిధాన్‌ కార్యక్రమంలో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం





కూకట్‌పల్లి గ్రామంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కృష్ణారావు సతీమణి మాధవరం లక్ష్మీబాయి, చైర్మన్‌ తులసిరావు దంపతులు, కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ భక్తులు పాల్గొన్నారు. -కూకట్‌పల్లి

ప్రజావాణిలో 82 ఫిర్యాదులు!

- ఆక్రమణలు, సంక్షేమ పథకాలపై దరఖాస్తులు
- వేతనాలపై పంచాయతీ కార్మికులు
- సర్వే చేసిన డబ్బుల కోసం సిబ్బంది మొర



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ కార్యాలయం మీటింగ్‌ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి 82 ఫిర్యాదులను అందజేశారు.

- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.
- భూకబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల ఆక్రమణలపై 23 ఫిర్యాదులు రాగా.. అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళ అంతస్తుల కట్టడాలపై అత్యధికంగా 34 ఫిర్యాదులు వచ్చాయి.
- నాగారం, దమ్మాయిగూడ, ఫీర్జాదిగూడ, పోచారం, మేడ్చల్‌, ఘట్‌కేసర్‌, జవహర్‌నగర్‌, కొంపెల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు ఉప్పల్‌, కుత్బుల్లాపూర్‌ మున్సిపల్‌ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి.
- ఇరిగేషన్‌పై ఐదు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు సంబంధించి 4 ఫిర్యాదులు, హౌసింగ్‌, పంచాయతీ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు, మెప్మా, విద్య, పోలీసుశాఖలకు సంబంధించినవి కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్‌ చంద్రావతి, డీఆర్‌డీఏ సాంబశివరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి..

వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలి. వినతులపై చేపట్టిన చర్యలను ప్రజలకు వివరిస్తూ ఆన్‌లైన్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలి. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలి.

– విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌

రాందేవ్‌రావ్‌ ఆసుపత్రిలో తల్లీపిల్లలకు వైద్య శిబిరం



ఆల్విన్‌కాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్‌లు' అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ తల్లి, పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ సందర్భంగా రాందేవ్‌రావ్‌ ఆసుపత్రిలో సోమవారం తల్లి, పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. గైనకాలజీ కన్సల్టేషన్‌, పిడియాట్రిక్‌ కన్సల్టేషన్‌, మామోగ్రఫీ, హెచ్‌పీవీ వాక్సినేషన్‌ (మొదటి డోస్‌) జీఆర్‌బీఎస్‌, పాప్‌ స్మియర్‌ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఛాయాదేవి మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా కుటుంబం, దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ భవాని దివ్య, యాజమాన్యం విక్రందేవ్‌ రావ్‌, మీరా రావ్‌, ప్రశాంత్‌ రెడ్డి, అపర్ణ రావ్‌, ఎండీ డాక్టర్‌ కె. కమలాకర్‌రావు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్‌ హస్తకళా ప్రదర్శన



కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్‌: వారానికి ఒక్కసారైనా చేనేత, ఖాదీ వస్త్రాలు ధరించి చేనేత కార్మికులకు చేయూతనందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కళాసిల్క్‌ హస్తకళ ప్రదర్శన నిర్వాహకులు వినోద్‌ జైన్‌ అన్నారు. మూసాపేట డివిజన్‌, మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న హస్త కళా ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని తెలిపారు. మేళాలో పట్టుచీరలు, ఫ్యాన్సీ డిజైనింగ్‌, పోచంపల్లి డ్రెస్‌ మెటీరియల్స్‌, చుడిదార్స్‌, సూటింగ్‌ అండ్‌ షర్టింగ్స్‌, జెవులరీ, బెడ్‌ షీట్స్‌తో పాటు వివిధ గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా కొనసాగుతుందని తెలిపారు. 10వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కాంతారావు, నాయకులు

మోతీనగర్‌: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బోరబండలోని ఆర్‌కే నగర్‌ చౌరస్తాలో డి. సందీప్‌ నాయక్‌ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు హాజరై జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌ నాయకులు డి. రామ్‌ గోపాల్‌ సింగ్‌, చందర్‌, నార్లాపురం శ్రీనివాస్‌, పూజార్యం, మనోహర్‌, బండి జనార్దన్‌, వేముల జనార్దన్‌, శ్రీలత, దామోదర్‌, నర్సింగ్‌, నాగరాజు, విజయ్‌, సాయిచంద్‌, నవీన్‌, మల్లేష్‌, విజయ్‌ మిత్ర, విజయ్‌, రంజిత్‌, సురేష్‌చౌదరి, రవి, సాయి, చరణ్‌, కిరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం



కూకట్‌పల్లి: భాగ్యనగర్‌ సేవా సమితి కన్వీనర్‌ వాసుదేవరెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో భగవాన్‌ సాయిబాబా శత జయంతోత్సవాల్లో భాగంగా భాగ్యనగర్‌ సమితి ఆధ్వర్యంలో పలు ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: శ్రీమాతా ఆటో యూనియన్‌ అభ్యర్థన మేరకు ఎన్‌సీఎస్‌ఆర్‌ చారిటుబుల్‌ ట్రస్ట్‌ వైస్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఎన్‌. వంశీరెడ్డి చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్‌ ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. వేసవి కాలంలో ముఖ్యంగా ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వం చలివేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్‌ అధ్యక్షుడు భాస్కర్‌ గౌడ్‌, బీజేపీ నాయకులు రెప్పన రాజు, సభ్యులు పాల్గొన్నారు.



ఆటో యూనియన్‌ డ్రైవర్లకు యూనిఫాం అందజేస్తున్న డా. వంశీరెడ్డి తదితరులు